బోరు వేసుకున్నా.. సర్వీసు సున్నా

- విద్యుత్ కోసం అన్నదాతల నిరీక్షణ
- పొలాల్లో నిరుపయోగంగా వ్యవసాయ బోర్లు
- ఎండిపోతున్న పంటలు
- నిడదవోలు డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో 305 దరఖాస్తులు



దేవరపల్లి మండలం దుద్దుకూరులో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బోరు

దేవరపల్లి: వ్యవసాయ బోర్ల విద్యుత్ సర్వీసుల కోసం మెట్ట ప్రాంత అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. దాదాపు ఆరు నెలల క్రితమే వారు ఒక్కొక్క బోరును రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వ్యయంతో పొలాల్లో వేసుకున్నారు. బోర్లు వేసుకున్నాక విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని తీసుకున్న అధికారులు సర్వీసుల జారీ గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న భూములను సాగులోకి తీసుకురావడానికి రైతులు తమ పొలాల్లో బోర్లు వేసుకున్నారు. వాటిని నమ్ముకుని రబీ సీజన్‌లో పంటలు కూడా వేశారు. నీటి సదుపాయం లేక పంటలు దెబ్బతినడంతో నష్టపోయారు. వేసిన బోర్లకు విద్యుత్ సర్వీసులు ఇప్పించాలని ఆరు నెలలుగా అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న కనికరించడం రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని అన్నదాతలు తెలిపారు. మార్చిలో బోర్లు వేసుకుని, సర్వీసుల కోసం దరఖాస్తు చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో సర్వీసులకు బ్రేక్ పడింది. ఎన్నికల అనంతరం కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో తన సమస్య తీరుతుందని ఆశించామని వారు తెలిపారు. సర్వీసుల కోసం అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని చెబుతున్నారని, అనుమతి వచ్చే వరకూ సర్వీసులు ఇవ్వకపోతే వేసిన పంటల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమది రైతు ప్రభుత్వం అని వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న కూటమి పాలకులకు తమ ఇబ్బందులు పట్టవా? అని ప్రశ్నిస్తున్నారు. ఇదేనా రైతు ప్రభుత్వం అంటే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెట్ట ప్రాంత సాగుకు బోర్లే ఆధారం

మెట్ట ప్రాంత రైతులకు ప్రధాన ఆధారం విద్యుత్ బోర్లు. 90 శాతం సాగు బోర్ల కిందే జరుగుతుంది. ఒకొక్క బోరును భూమిలో 400 నుంచి 600 అడుగుల లోతున వేసి 30 నుంచి 40 హెచ్‌పీ మోటార్లు అమర్చుతారు. వాటి సాయంతో భూగర్భ జలాలను బయటకు తీసుకు తెచ్చి పంటలు పండిస్తారు. ఇటీవల చిన్న, సన్నకారు రైతులు కూడా అప్పులు చేసి బోర్లు వేసుకుని పంటలు పండిస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి బోర్లు వేసుకున్నా విద్యుత్ సర్వీసులు ఇచ్చేందుకు ప్రభుత్వం నానా అవస్థలూ పెడుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ గోడు ప్రభుత్వానికి పట్టదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. కనీసం ఎస్టిమేట్స్ కూడా వేయలేదని, అవి వేస్తే సొమ్ములు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు చెబుతున్నారు. బద్దులు కట్టిన బోర్లకు కూడా సర్వీసులు ఇవ్వలేదని పలువురు పేర్కొంటున్నారు. దరఖాస్తు చేసిన వారం రోజుల్లోనే కమర్షియల్ సర్వీసులు ఇస్తున్న అధికారులు వ్యవసాయానికి ఎందుకు ఇవ్వడం లేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం వ్యవసాయ బోర్లకు సర్వీసులు ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఎనిమిది నెలలుగా నిరీక్షిస్తున్నాం

బోర్లు వేసుకుని, ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని విద్యుత్ సర్వీసుల కోసం ఎనిమిది నెలలుగా నిరీక్షిస్తున్నాం. ఇంతవరకూ అధికారులు పట్టించుకోలేదు. అడిగితే ప్రభుత్వం నుంచి అనుమతి రావాలంటున్నారు. నీటి సదుపాయం లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. దుద్దుకూరులో 10 మంది రైతులు సొంతంగా బోర్లు వేసుకున్నారు. ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రైతుల గోడు ఎవరికీ పట్టదా?

– కాకర్ల వెంకటేశ్వరరావు, రైతు, దుద్దుకూరు, దేవరపల్లి మండలం

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

కొత్తగా వేసిన వ్యవసాయ బోర్లకు విద్యుత్ సర్వీసుల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంది. ప్రభుత్వ పాలసీ కోసం చూస్తున్నాం. నిడదవోలు డివిజన్ పరిధిలో సుమారు 305 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి ఎస్టిమేట్ వేసి రైతులతో సొమ్ములు కట్టించవలసి ఉంది. డబ్బులు కట్టిన రైతులందరికి సర్వీసులు ఇచ్చాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఎస్టిమేట్స్ వేసి సర్వీసులు ఇస్తాం. ఎన్నికల ముందు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

– ఎస్. నారాయణ అప్పారావు, ఈఈ, ఏపీ ఈపీడీసీఎల్, నిడదవోలు

క్లుప్తంగా

ఆయుష్మాన్ కార్డుతో వృద్ధులకు ఉచిత వైద్యం

నిడదవోలు: 70 ఏళ్ల వయసు పైబడిన వారు కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ కార్డుతో ఉచిత వైద్య సేవలు పొందవచ్చని నిడదవోలు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 70 ఏళ్లు పైబడిన వారికి ఆదాయంతో సంబంధం లేకుండా ఏబీ పీఎంజేవై పథకంలో రూ.5 లక్షల వరకూ వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ వయసు పైబడిన వృద్ధులు తమ ఫోన్ నంబర్‌కు లింకైన ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని కంప్యూటర్ సెంటర్స్, మీ సేవా కేంద్రాలకు వెళ్లి ఆయుష్మాన్ కార్డు తీసుకోవాలని సూర్య చంద్రరావు సూచించారు.

నేడు కొవ్వూరులో వేదసభ

కొవ్వూరు: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆర్థిక సహకారంతో పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు వేదసభ నిర్వహించనున్నట్టు స్థానిక గోష్పాద క్షేత్రం వేద శాస్త్రాభివర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎన్ శాస్త్రి శనివారం తెలిపారు. నిరంజన్ ధర్మజ్ఞాన కళావేదికలో ఈ వేద సభ నిర్వహిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ధర్మవరం బాలిక



విద్యార్థిని మహాశ్రీలక్ష్మిని అభినందిస్తున్న హెచ్‌ఎం (ఎఫ్ఏసీ) ప్రసాద్ తదితరులు

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ –14 బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని ధర్మవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కడియం మహాశ్రీలక్ష్మి ఎంపికైంది. ఏలూరులోని ఏఎస్సార్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో మహాశ్రీలక్ష్మి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ నేపథ్యంలో ఆమె అండర్–14 బాలికల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 9 నుంచి 11 వరకూ విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో ఆమె జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈనెల 4 నుంచి ఎనిమిదో తేదీ వరకూ అవంతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వూరులో బాలబాలికల వాలీబాల్ జట్లకు శిక్షణ ఇస్తారు. మహాశ్రీలక్ష్మిని, ఆమెకు శిక్షణ అందించిన పీడీ ఆర్.సురేష్‌ను ధర్మవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం (ఎఫ్ఏసీ) ప్రసాద్ అభినందించారు.

మంచినీటి సరఫరా వేళల మార్పు

నిడదవోలు: కార్తిక మాసం సందర్భంగా పట్టణంలో మంచినీటి సరఫరా వేళలను మార్పు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి శనివారం తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ మంచినీటి సరఫరా చేస్తామని ఆమె పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు బంగార్రాజు మృతి



తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడుకు చెందిన సీనియర్ కాపు నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత, మలకపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు గనిశెట్టి బంగార్రాజు (75) శనివారం మృతి చెందారు. రైతు కుటుంబానికి చెందిన ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు పిట్టా శ్రీనివాస్, నాయకులు కొమ్మిరెడ్డి పరశు రామారావు, సిద్ధంశెట్టి కృష్ణ, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు పట్టుకున్న ఆర్డీవో రాణి సుస్మిత



వాడపల్లిలో లారీని ఆపి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలను కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత శనివారం పట్టుకున్నారు. మండలంలోని వాడపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మార్గంలో వస్తున్న లారీలను టాస్క్‌ఫోర్సు పోలీసుల సహకారంతో ఆర్డీవో ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేయించాల్సిందిగా ఆర్డీవో ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న లారీలను సీజ్ చేసి కొవ్వూరు పట్టణ పోలీసులకు అప్పగించారు. వీఆర్వో ఎం.దుర్గారావు ఫిర్యాదు మేరకు లారీలను అదుపులోకి తీసుకున్నామని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

టెన్నికాయిట్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా టెన్నికాయిట్ అండర్- 14, 17 జట్లకు ఎంపికైన బాలబాలికలు

దేవరపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా టెన్నికాయిట్ అండర్ –14, అండర్–17 బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి బాలబాలికలు పాల్గొని ప్రతిభ చాటారు. ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అండర్- 17 బాలికల జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఆర్. సంకృతి , ఎం. గంగ , వై.ఐశ్వర్య, ఎం.చంద్రిక (నలుగురూ రామన్నపాలెం), ఎం.పూజిత(చింతలపూడి) ఎంపికయ్యారు. అండర్- 14 విభాగంలో జె.సిరివల్లి, ఎం. ప్రియదర్శిని, ఎం.లలితశ్రీ , ఎస్‌కే లతీఫా (నలుగురూ రామన్నపాలెం), టి. జ్యోషిత (కె.గోకవరం) ఎంపికయ్యారు. బాలుర అండర్-17 విభాగంలో టి. దుర్గాప్రసాద్ (ఎస్‌వీపీఎస్ జెఆర్‌జె), ఎం. సందీప్ (బీహెచ్ఎస్సార్ దేవరపల్లి), ఎం సుశాంత్, బి. లక్ష్మణ్(ఇద్దరూ రామన్నపాలెం), ఎం. చరణ్(కె.గోకవరం) ఎంపికయ్యారు. అండర్ –14 విభాగంలో జి. శామ్యేల్, జె. చరణ్, వై. విజయ్‌బాబు (ముగ్గురూ కె. గోకవరం), జి. బాబి, జి. ఈశ్వర్, (రామన్నపాలెం) ఎంపికైనట్టు రామన్నపాలెం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ తెలిపారు. ఈ జట్లు ఈ నెల 9,10,11 తేదీల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

దేవరపల్లి: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నూతన ఫీడర్ పనులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎస్. నారాయణ అప్పారావు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ పల్లంట్ల సబ్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌కో లైన్ల పనుల నిమిత్తం 11 కేవీ లక్ష్మీపురం ఫీడర్‌లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్‌ను ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 6 గంటల వరకూ ఇస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ కొవ్వూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఫసీ ఉల్లాబేగ్

కొవ్వూరు: కాపవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఎండీ ఫసీ ఉల్లాబేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీ ఉల్లా బేగ్‌కు ఈయన కుమారుడు. ప్రస్తుతం ఫసీ ఉల్లాబేగ్ భార్య అమర్ జహీ బేగ్ ఏఐసీసీ మెంబర్‌గాను, పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నారు.

నిజాయితీ సంస్కృతిపైనే దేశ పురోగతి



గోపాలపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ శ్రీరామ్

గోపాలపురం: నిజాయితీ అనే సంస్కృతి ద్వారానే దేశం పురోభివృద్ధి చెందుతుందని ఎల్ఐసీ కొవ్వూరు సీనియర్ బ్రాంచి మేనేజర్ కె.శ్రీరామ్ అన్నారు. నిజాయితీ ద్వారానే దేశం పురోగతి చెందుతుందన్న అంశంపై గోపాలపురం ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా భారతీయ జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మన దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి ప్రధాన అవరోధంగా మారిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో అవినీతి నిర్మూలను కలసి కట్టుగా పని చేయాలని ఆయన యువతకు పిలుపు నిచ్చారు కార్యక్రమంలో ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ విష్ణువర్ధన్, రమేష్‌బాబు, గుబ్బా లక్ష్మణరావు, గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యానారాయణ, వివిధ పార్టీల నాయకులు ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

తేగ తినాలనిపించేలా..



నల్లజర్ల జంక్షన్‌లో తేగల అమ్మకాలు

నల్లజర్ల: తేగ ..ఈ పేరు వింటేనే చాలామంది నోరూరుతుంది. ఈ సీజన్లో ఎక్కువగా లభించే తేగలు తింటే ఆరోగ్యానికి మేలని వైద్యులు చెబుతున్నారు. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే తేగలను తినడం ద్వారా శరీరంలో కొవ్వు శాతం తగ్గి జీర్ణశక్తి పెరగడంతో పాటు మలబద్ధకం పోతుందని చెబుతున్నారు. మండలంలోని దూబచర్ల పరిసర ఎర్ర నేలల్లో లభించే తేగలు రుచికరంగా ఉంటాయి. అయ్యవరం, కొత్తగూడెం తదితర గ్రామాల నుంచి విజయవాడ, హైదరాబాద్, గుంటూరు వంటి పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. తాటికాయలను ఇసుక పొళ్లున్న ఎర్రమట్టిలో పాతర వేస్తే వర్షాకాలంలో తేగలు బాగా తయారవుతాయి. నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో వాటిని తవ్వి బయటకు తీసి తాటిబుర్రను వేరు చేస్తారు. పచ్చి తేగలను రేకు డబ్బాల్లోగాని, కుండలోగాని పెట్టి బోర్లించి పైన మంట పెట్టడం ద్వారా ఉడికిస్తారు. ఇలా ప్రత్యేక తరహాలో కాల్చిన తేగలను ఒక రాత్రంతా మంచులో ఉంచితే పిండి పదార్థంగా మారతాయి. అన్ని ప్రాంతాల్లో తేగలు దొరికే అవకాశం ఉన్నా ఎర్ర నేలల్లో ఊరిన తేగలు రుచికరంగా ఉంటాయి. అంతగా ఊరని తేగలు ముక్కలు చేయడానికి కూడ వీలుండదు. అటువంటి వాటిని పిల్లలే కాదు పెద్దలు కూడ నోటిలో పెట్టుకుని నమిలేస్తుంటారు. బాగా ఊరిన తేగలను ముక్కలు చేసి తేనె, బెల్లం కలుపుకొని రోట్లో వేసి దంచి ఉండలుగా చేసి తింటుంటారు. మరికొందరైతే కొబ్బరి లాగ కోరి బెల్లం, తేనెలతో మిక్స్ చేసి ఆరగిస్తుంటారు. చిరు వ్యాపారులు పాతరల లెక్కన తేగలను కొనుగోలు చేసి అమ్మకాలు సాగిస్తుంటారు. ఒక్క నల్లజర్ల, దూబచర్ల జంక్షన్‌లలోనే బస్సుల వద్ద అమ్మే వారు ఇరవై మందికి పైగా ఉన్నారు. గీత కార్మికులతో పాటు అనేక కుటుంబాలు ఈ తేగల వ్యాపారం ద్వారా ఆదాయం పొందుతున్నాయి.

ర్యాంపులు తెరచి ఉపాధి కల్పించండి

కలెక్టర్‌ను కలసిన బోట్స్‌మన్ సొసైటీ సభ్యులు, పడవ కార్మికులు



రాజమహేంద్రవరం కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన కార్మికులు, బోట్స్‌మన్ సొసైటీ సభ్యులు



ప్రక్కిలంకలో ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

తాళ్లపూడి: మండలంలోని గోదావరి ఇసుక ర్యాంపులను తెరిచి తమకు జీవనోపాధి కల్పించాలని బోట్స్‌మన్ సొసైటీ సభ్యులు, పడవ కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు వారు శనివారం రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కలసి విన్నవించారు. మండలంలోని తాడిపూడి, ప్రక్కిలంక, తాళ్లపూడి, వేగేశ్వరపురం నుంచి పడవ కార్మికులు, పడవల యజమానులు రాజమహేంద్రవరం వెళ్లి కలెక్టర్‌కు తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రక్కిలంకలో గండిపోశమ్మ బోట్స్‌మెన్ అండ్ సాండ్ క్వారీ వర్కర్ల సహకార సంఘం, గణేష్, గంగాలమ్మ వర్కర్ల సంఘాలతో పాటు ఇతర సంఘాలకు చెందిన సుమారు 200 కుటుంబాలు ఇసుక ర్యాంపులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇసుక తవ్వకాలను ఇంకా ప్రారంభించక పోవడంతో వారి ఉపాధికి విఘాతం కలిగిందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నామని, త్వరలోనే ఇసుక ర్యాంపులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ తమకు హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలసిన వారిలో చెన్నా సత్యనారాయణ, చింతపల్లి బుజ్జి, భీమరాజు, కేవీఎస్ కొట్నీస్, పి.పుష్పరాజు, దేవరపల్లి శ్రీను, అడ్డాల శ్రీను, డేరా రాము, అంబటి కృష్ణ, ఊబా శేఖర్ తదితరులు ఉన్నారు.

ర్యాంపుల పరిశీలన

మండలంలోని ఇసుక ర్యాంపులను శనివారం సాయంత్రం రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు పరిశీలించారు. వారు గోదావరి నదిలో పడవలో వెళ్లి ప్రక్కిలంక, తాడిపూడి, తాళ్లపూడి తదితర గ్రామాల ఇసుక ర్యాంపులను పరిశీలించారు. ర్యాపులను తెరవడానికి ఉన్న పరిస్థితులను పరిశీలించినట్టు వారు తెలిపారు. మైనింగ్ ఏడీ విఘ్నేశ్వరుడు, డిప్యూటీ తహసీల్దార్ మోహనభారతి, వీఆర్వో సంజీవరావు తదితరులు ఉన్నారు.

వలంటరీ టీచర్లకు శిక్షణ తరగతులు



నిడదవోలులో శిక్షణ తరగతులకు హాజరైన వలంటరీ టీచర్లు

నిడదవోలు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వలంటరీ టీచర్లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు 77 మంది వలంటరీ టీచర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో దూలం లక్ష్మీనారాయణ, ఏపీఎం మహాలక్ష్మీ, ఎంఈవోలు గణేష్, గురుమూర్తి, ఉపాధ్యాయ శిక్షణ నిపుణుడు శ్రీనివాసశాస్త్రి, వయోజన విద్యా ఉపసంచాలకుడు పసుపులేటి పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో 44 మందికి..

చాగల్లు: మండలంలో గుర్తించిన 880 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు 88 మంది వలంటీర్ల టీచర్లను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి చెప్పారు. ఇందులో భాగంగా 44 మంది వలంటీర్ల టీచర్లకు పీపీటీ ద్వారా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చినట్టు ఆమె వెల్లడించారు. మిగిలిన వలంటీర్ల టీచర్లకు తర్వాత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు , ఎంఈఓ యు. గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు రోడ్డుకు మరమ్మతులు ప్రారంభం

కొవ్వూరు: మండలంలోని మద్దూరు గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పూజ నిర్వహించి ప్రారంభించారు. ఆర్ అండ్ బీ నుంచి మంజూరైన రూ.22 లక్షల వ్యయంతో ఈ రోడ్డు మరమ్మతులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మద్దూరు సర్పంచ్ ఉప్పులూరి ముని రాజేంద్రప్రసాద్ (బాబ్జీ), నాయకులు నాయుడు వీర్రాజు, ఆర్ అండ్ బీ ఏఈ విజయ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

G.W.O.P. No. 37/2024

Between:
1. తాళ్ళపల్లి నాగశివదుర్గ కృష్ణ భాగ్యశ్రీ
2. తాళ్ళపల్లి మాణిక్య నాగశ్రీ - Minor wards (మైనర్లు అయినందున వారి తల్లి) తాళ్ళపల్లి అంజలీ దేవి, W/o. late తాళ్ళపల్లి కృష్ణారావు, వయస్సు 48 సం॥లు, డో.నెం. 4-15-126/89, భారత్‌పేట, 9వ వీధి, 44వ వార్డు, గుంటూరు వెస్ట్ -పిటీషనరు

Vs

Nil -రెస్పాండెంటు

వాయిదా: 11-11-2024

ఈ నెంబరు గార్డియన్ O.P. నందు పిటీషనర్ తనకు గల మైనర్ వార్డుకు, తాళ్ళపల్లి కృష్ణారావు, తాళ్ళపల్లి అంజలీదేవి జాయింట్‌గా కొన్న ఆస్తి నందు తాళ్ళపల్లి కృష్ణారావు చనిపోయినందున హిందూ వారసత్వ రీత్యా మైనర్ వార్డుకి కృష్ణారావు ఆస్తిలో వచ్చు 1/3 ఆస్తిని మైనర్ వార్డ్స్ యొక్క చదువు మరియు ఇతర అవసరములు కోసం 1. కోడూరి సత్యవాణి, 2. చలికి వాణి శ్రీదేవి గార్లకు వ్రాసిన ది. 07-08-2024 తేదీన అగ్రిమెంటు ప్రకారం వారి పేరున రిజిష్టర్ దస్తావేజు చేయటకుగాను మైనర్ వార్డ్స్ తరుపు గార్డియన్ అయిన తల్లి తాళ్ళపల్లి అంజలీదేవి గారికి పర్మిషన్ ఇప్పించమని దాఖలు చేసిన గార్డియన్ O.P. పిటీషన్‌లో ఎవరికైనా అభ్యంతరము ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట ది. 11-11-2024 వ ఉదయం గం॥ 10.30 ని॥లకు లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, శ్రీ కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన వేములూరు పంచాయితీ ఏరియాలోని వేములూరు గ్రామం తాలూకు జిరాయితీ మెరక ఆర్.యస్. నెం. 48/2బి రు దాఖల య. 1-78 ట్లు భూమికి ప్రస్తుత రీ సర్వే ప్రకారం ప్రస్తుత సబ్ డివిజన్ ప్రకారం ప్రస్తుత ఆర్.యస్. నెం. 48/2బి1, 48/2బి2 ర్లు దాఖల ఎల్.పి. నెం. 163 రు దాఖల య. 1-78ట్లు భూమికి హద్దులు.

తూర్పు: పుంత, దక్షిణం: ఆకుల సూర్యనారాయణ, ఆకుల దుర్గారావు వగైరాల భూమి. పడమర: కంఠమణి బలరామకృష్ణ వగైరాలు భూమి. ఉత్తరం: జుజ్జవరపు బాపన్న వగైరాల భూమి.

ఈ హద్దుల మధ్య య. 1-78 సెంట్లు లేక 0.719 హెక్టార్లు భూమిలో అనిర్దిష్టపు 1/3 వంతు అనగా య. 0-59.33 సెంట్లు భూమి, ఇందలి కరెంటు సర్వీసు నెం. 213 రు దాఖలా 5 హెచ్.పి. మోటారు బోరులో 1/2వ వంతులో 1/3వ వంతు హక్కులతో సహా సమస్త యీజుమెంటు హక్కులతో సహా.

కొవ్వూరు | ఎ.వెంకటరావు
ది.01-11-24 | అడ్వకేట్, కొవ్వూరు

గోష్పాద క్షేత్రానికి కార్తిక శోభ




కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



గోష్పాద క్షేత్రం స్నానఘట్టంలో కార్తిక దీపారాధన చేస్తున్న భక్తులు

కొవ్వూరు: పవిత్ర కార్తిక మాసంలోని తొలి రోజు కావడంతో శనివారం స్థానిక గోష్పాద క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. వేలాది మంది భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్త జనంతో తెల్లవారుజాము నుంచే ఈ క్షేత్రం కళకళలాడింది. కుటుంబ సమేతంగా నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు నది ఒడ్డున పూజలు చేసి నదిలో కార్తిక దీపాలు విడిచి పెట్టారు. స్నానఘట్టంలోని శివలింగానికి భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వస్వామి ఆలయం, పంచాయతన శివాలయం, పాతూరులోని శ్రీ ఉమా చోడేశ్వర స్వామివారి ఆలయం, దొమ్మేరు గ్రామంలోని ఉద్దండ మల్లికార్జునస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిడదవోలు: పట్టణంలోని పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే గల చినకాశి రేవులో శనివారం వేకువ జామునే భక్తులు గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం శైవ క్షేత్రాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పురాతన రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి వార్ల ఆలయాల్లో వేకువ జామున అర్చకులు స్వామివారికి నిత్యాభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో సాయంత్రం మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. రిటైర్డు తెలుగు పండితుడు పొన్నా కృష్ణబాబు చెప్పిన శివ పురాణం భక్తులను ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రాల నడుమ భక్తులు ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమలో ఆలయ ఈవోలు సోమాల శివ, నామా సూర్య ప్రకాశ్, అర్చకులు శ్రీకాకులపు వెంకటేశ్వర రావు, శ్రీకాకుళపు లక్ష్మీనరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు సోమేశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com